క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

కొలిమిగుండ్ల: ఇళ్ల నిర్మాణాల్లో లబ్ధిదారులు వేగం పెంచాలని ఎంపీడీఓ సుబ్బరాజు సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం కొలిమిగుండ్లలోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ ఏఈ మద్దిలేటి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, ఈఓఆర్డీ తాహీర్‌హుశేన్‌తో కలిసి ఎంపీడీఓ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించామని, త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని చెప్పారు.

ఆలయ జీర్ణోద్ధరణకు విరాళం

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని పాటిమీద వెలసిన ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు కోవెలకుంట్లకు చెందిన పత్తి సురేష్ శనివారం విరాళమిచ్చారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సాయంగా రూ. 10 వేలను కమిటీ సభ్యులు పవన్ శ్రీనివాసరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డికి అందజేశారు.

ప్రయాణికుల సౌకర్యార్థం బెంచీల విరాళం



బేతంచెర్ల రోడ్డులోని బస్టాప్‌లో ఏర్పాటు చేసిన బెంచీలు

డోన్ : వేసవి నేపథ్యంలో పట్టణంలోని పలు బస్‌స్టాపుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. స్థానిక బేతంచెర్ల రోడ్డులో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్‌సెల్టర్‌కు డాక్యుమెంట్ రైటర్ జాకీర్ హుసేన్ రూ.10వేల విలువ చేసే మూడు బెంచీలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేష్ మాట్లాడుతూ మండే ఎండలను దృష్టిలో ఉంచుకొని బస్‌స్టాప్ వద్ద చలివేంద్రాలు, చలువ పందిళ్లతో పాటు బెంచీలను కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు.

నేషనల్ అవార్డుకు విద్యార్థిని ఎంపిక



ఎ.సహన

డోన్ టౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ మెరిట్ అవార్డుకు మారెళ్ల సహన ఎంపిక అయినట్లు శ్రీసుధ కళాశాల ప్రిన్స్‌పాల్ యోగానందరెడ్డి శనివారం తెలిపారు. గతేడాది ద్వితీయ సంవత్సరం ఇంటర్ మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో వెయ్యి మార్కులకు గాను 990 మార్కులు సాధించినందుకు ఈ అవార్డుకు ఎంపికయినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సహనకు కళాశాల తరుపున అభినందనలు తెలియజేసారు.

మట్టి నమూనా సేకరణపై శిక్షణ



మట్టి నమూనా సేకరణను పరిశీలిస్తున్న ఏడీ అశోక్ వర్ధన్ రెడ్డి

బేతంచెర్ల: మండలంలోని ఆర్‌బీకేలో పనిచేసే అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌కు స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో శనివారం మట్టిన మూనా సేకరణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డోన్ వ్యవసాయ శాఖ ఏడీ అశోక్ వర్ధన్ రెడ్డి, ఏఓ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నేల ప్రాముఖ్యత, మట్టి నమూనాలు ఏవిధంగా సేకరించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. మట్టి నమూనాలు సేకరణతో రైతులకు పంటల సాగు, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించడానికి అవకాశం ఉందని ఏడీ తెలిపారు.

రేపు విగ్రహాల ప్రతిష్ఠ

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని వెంకటరమణ కాలనీలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో ఆంజనేయస్వామి, గరుత్మండు, సుబ్రహ్మణేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు వెల్లడించారు. అనంతరం సుదర్శన, రుద్రహోమాలు, పార్వతీ పరమేశ్వర కల్యాణ మహోత్సం ఉంటుందన్నారు. అదేవిధంగా ఇప్పటికే ఆలయంలో విగ్రహాలు ప్రతిష్ఠించి 40 రోజులు పూర్తి అయిన సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

కాలువలోపడి వ్యక్తి మృతి

అవుకు: మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామ సమీపంలోని జీఎన్ఎస్ఎస్ కాలువలో శనివారం మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెర్లోపల్లెకు చెందిన చాకలి సుధాకర్ (28) శుక్రవారం ఉదయం బట్టలు ఉతకటానికి గ్రామ సమీపంలోని హెడ్ రెగ్యులేటర్ గేట్ల వద్దకు వెళ్లాడు. బట్టలు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు జీఎన్ఎస్ఎస్ కాలువలో పడిపోయాడని అన్నారు. శనివారం మధ్యాహ్నం కాలువలో గాలిస్తుండగా మృతదేహం బయటకు తేలిందని మృతుని తండ్రి చాకలి ఉశేని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

నెరవేరిన కల!

- పత్ర గొల్లలకు బీసీ 'ఏ' సర్టిఫికెట్
- జారీ చేస్తామన్న అధికారులు
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరువతో సమస్య పరిష్కారం
- వెల్లువెత్తుతున్న హర్షాతిరేకాలు



హుసేనాపురంలో శుక్రవారం పర్యటించిన మంత్రి బుగ్గనకు వినతి పత్రం ఇస్తున్న పత్ర కులస్తులు

డోన్ : ఎట్టకేలకు పత్ర(గొల్లలు) కులస్తులకు బీసీ 'ఏ' సర్టిఫికెట్ జారీ కానుంది. ప్యాపిలి మండల పరిధిలోని చంద్రపల్లి, పి.ఆర్.పల్లి, హుసేనాపురం తదితర గ్రామాల్లో అధికంగా ఉన్న పత్ర గొల్లల ఏళ్ల తరబడి కల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరువతో నెరవేరనుంది. బీసీ 'డీ'గా ఉన్న వారికి బీసీ 'ఏ' సర్టిఫికెట్‌ను అధికారులు మంజూరు చేయన్నారు. వాస్తవానికి 2006 నుంచి తమను బీసీ డీ నుంచి బీసీ ఏ లో చేర్చాలని పత్ర(గొల్లలు) కులస్తులు పోరాడతూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయన జస్టిస్ పుట్టుస్వామి కమిషన్‌ను ఏర్పాటు చేశారు. కమిషన్ సిఫారసు మేరకు బీసీ ఏలో పత్ర కులస్తులను చేర్చారు. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా మండలాల్లో పత్ర కులస్తులకు బీసీ ఏ సర్టిఫికెట్‌లను తహసీల్దార్ మంజూరు చేస్తున్నారు. అయితే ప్యాపిలి మండంలో మాత్రం తహసీల్దార్ సర్టిఫికెట్ మంజూరు చేయడం లేదు. దీంతో వారు సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదు. సమస్యను వివిధ రూపాల్లో ఆ కులస్తులు, నాయకులు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు.

సానుకూలంగా స్పందించిన మంత్రి బగ్గన

పత్ర కులస్తుల (గొల్లలు) సమస్యపై ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. శుక్రవారం హుసేనాపురం పర్యటనకు వచ్చిన మంత్రికి చంద్రపల్లె గ్రామ సర్పంచ్ జొన్నగిరి సరోజమ్మ సహకారంతో ఆ కులస్తులు సమస్యను విన్నవించారు. రాష్టంలో తమకు బీసీ 'ఏ' సర్టిఫికెట్ మంజూరు చేస్తున్నా ప్యాపిలిలో మాత్రం అధికారులు ఇవ్వడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి వెంటనే తహసీల్దార్‌ను పిలిపించి సమస్యపై ఆరా తీశారు. ప్రభుత్వ గెజిట్ జీఓ ఎం.ఎస్ 8 ప్రకారం పత్ర కులస్తులను బీసీ 'ఏ' గా గుర్తించి కుల సర్టిఫికెట్లు మంజూరు చేయాలని ఆదేశించారు. దీంతో ఏళ్లతరడి నెలకొన్న సమస్యకు పరిష్కారం లభించింది. ఆ సామాజికవర్గాల నుంచి హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి బుగ్గనతోపాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్ఆర్ ఆజన్మాంతం గుర్తుంటారు



ఎక్కడో కొండల్లో కట్టెలు కొట్టి ఇతర ఊర్లలో విక్రయించే తమను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అత్యంత వెనుకబడిన కులాలు(ఎంబీసీ) జాబీతాలో చేర్చారు. ఆ మహానుభావుడి కృషి ఫలితంగా నేడు అనేక మందిమి విద్యావంతులమయ్యాం. ఉపాధి పొందుతున్నాం. వైఎస్ఆర్ ఆజన్మాంతం గుర్తుంటారు
– పెద్దగువ్వల పంచలింగేశ్వర, చంద్రపల్లె

ప్రభుత్వ సదుపాయాన్ని కోల్పోయాం



పత్ర కులాన్ని డైరెక్ట్ బెన్‌ఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) కింద చేర్చడం వలన తమ ఇళ్లకు 100 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. అయితే అధికారులు జీఓ నంబర్ (8 28-08-2006, ఎంబీసీ జీఓ ఎంఎస్ నంబర్ 105ను 17-06-2016) పట్టించుకోకపోవడంతో నిరుపేదలమైన మేము ప్రభుత్వ సౌకర్యాలను కోల్పోవాల్సి వచ్చింది. సమస్యను పరిష్కరించిన మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు.
– పసుపల రాము, చంద్రపల్లె

వైఎస్ఆర్ సాయం మరువం



రాష్ట్రంలో 60లక్షలు, కర్నూలు జిల్లాలో 20లక్షల జనాభా కలిగిన పత్ర కులస్తులకు బీసీ ఏ సర్టిఫికెట్ మంజూరు చేసేందుకు కషి చేసిన దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సాయం మరువం. తమ సమస్యను పరిష్కరించేందుకు వెంటనే సహకరించిన ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు. మా సామాజికవర్గాల ప్రజలు బుగ్గనకు రుణపడి ఉన్నాం.– తలుపుల శ్రీనివాస్ నాయుడు, పత్ర కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు

మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు



పత్ర కులస్తులు ఏళ్లతరబడి ఇబ్బంది పడుతున్న సమస్యను పరిష్కరించిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. అనేక కారణాలతో పత్ర కులస్తులకు బీసీ ఏ సర్టిఫికెట్ మంజూరు కావడం లేదు. మంత్రికి సమస్యను వివరించడంతో అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజా ప్రభుత్వం అనడానికి ఈ సంఘటనే ప్రత్యక్ష సాక్ష్యం. పత్ర కులస్తుల సమస్య పరిష్కారం సర్పంచ్‌గా తనకూ సంతృప్తిగా ఉంది. – జొన్నగిరి సరోజమ్మ, సర్పంచ్, చంద్రపల్లె

విచారించి న్యాయం చేస్తాం



బీసీ ఏ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి పత్ర కులస్తుల గురించి గ్రామంలో విచారించి మంజూరు చేస్తాం. దరఖాస్తుదారుల పూర్వాపురాలు, జీవన విధానం గురించి సమగ్రంగా విచారణ జరిపి అర్హులైన అందరికీ సర్టిఫికెట్లు మంజూరు చేయడం ద్వారా న్యాయం చేస్తాం.
– చంద్రశేఖర్ వర్మ, తహసీల్దార్, ప్యాపిలి

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

కోవెలకుంట్ల: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకం కింద పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా సూచించారు. శనివారం పట్టణ శివారులోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న గృహాల నిర్మాణాలను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పక్కాగృహానికి ప్రభుత్వం మూడు విడతల్లో రూ. 1.80 లక్షలతోపాటు ఉచితంగా 20 టన్నుల ఇసుక, రాయితీపై సిమెంట్, ఇనుప కడ్డీలు, గృహ నిర్మాణ సామాగ్రి అందజేస్తోందన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని సొంతింటి కల నెరవేర్చుకోవాలని పేర్కొన్నారు.

కార్పొరేట్ కళాశాలల ఉచ్చులో పడకండి

డోన్ టౌన్: ప్రచార ఆర్భాటాలకు మోసపోయి కార్పొరేట్ ఉచ్చుల్లో పడకండ అని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్,అశోక్ సూచించారు. శనివారం పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద కార్పొరేట్ కళాశాలలకు వ్యతిరేకంగా ముద్రించిన కర పత్రాలను విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు లక్షల్లో రాస్తున్నారని, పదుల్లో వచ్చిన ర్యాంకులను ప్రచార ఆర్భాటాలతో పోకస్ చేస్తూ ఆకర్షిస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్ కళాశాల్లో విద్యార్థులను ఎల్లవేళలో చదివిస్తూ మానసిక వత్తిడికి గురి చేస్తూ వారిని ఆత్మ హత్యలకు దారి తీసే విధంగా వత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇప్పానా, శ్రీనివాస్, లవకుమార్, శివ, వేణుమాధవ్, సునీల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి

- ఏపీఐడీసీ చైర్‌పర్సన్ కర్రా గిరిజ



ప్రశ్నావళిని నింపుతున్న ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్ కర్రా గిరిజ

కోవెలకుంట్ల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తోందని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని రెండవ గ్రామ సచివాలయ పరిధిలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటర్లతో కలిసి ఆమె ఇంటింటినీ సందర్శించారు. కుటుంబ యజమానులతో మాట్లాడి వారి అభిప్రాయాల మేరకు ప్రశ్నావళిని నింపారు. ఆయా కుటుంబాలకు మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అర్హత ఉండి ఇంకా ఏవైనా పథకాలు అందాలా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా కుటుంబ యజమానుల అనుమతితో వారి ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై పూర్తి నమ్మకంతో ఉన్నామని ప్రజలు స్వచ్ఛందంగా సమాధానమిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ మధుసూదన్‌రెడ్డి, కన్వీనర్ దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో సత్ఫలితాలు



మాట్లాడుతున్న ఏఓ పవణ్ కుమార్

కొలిమిగుండ్ల: రైతులు భూసార పరీక్షలు చేయించుకుంటే సత్ఫలితాలు సాధిస్తారని ఏఓ పవణ్ కుమార్ తెలిపారు. కొలిమిగుండ్ల రైతు భరోసా కేంద్రం ఆవరణలో శనివారం మండలంలోని ఆర్బీకే ఇన్‌చార్జ్‌లు, ఎంపీఈఓలకు భూసార పరీక్షలపై ఆయన అవగాహన కల్పించారు. భూసార పరీక్షల వారోత్సవాల్లో భాగంగా ప్రతి ఆర్బీకే పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. మట్టినమూన పరీక్షలతో ఏ పంటలు సాగు చేసుకోవాలి, ఎంత మోతాదులో మందులు వాడాలి అనే విషయాలు తెలుసుకోవచ్చని, ఆ దిశగా రైతులను చైతన్య పరచాలని సూచించారు.

పంట మార్పిడిని పాటించాలి

సంజామల(కోవెలకుంట్ల): ప్రతిసారి ఒకే రకమైన సాగు చేయకుండా పంట మార్పిడి పద్ధతులను పాటించాలని సంజామల మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్లకు ఒక రోజు శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ భూసార పరీక్ష చేయించుకుంటే భూమిలో ఉన్న పోషకాలు గుర్తించవచ్చన్నారు. పోషకాల ఆధారం మేరకు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటిస్తూ రైతులు అధిక దిగుబడులు సాధించాలని పేర్కొన్నారు. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా ఒక్కో ఆర్బీకే పరిధిలో 20 మంది రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షా కేంద్రానికి పంపాలని సూచించారు. అనంతరం సంజామల సమీపంలోని రైతు పొలంలో మట్టి నమూనాలు సేకరించారు.

కోలుకోలేక రైతు మృతి

అవుకు: మండల పరిధిలోని శింగనపల్లె గ్రామానికి చెందిన ఓ రైతు చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శింగనపల్లె గ్రామానికి చెందిన రామతీర్థం ఉసేని(28) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ ఏడాది అదే గ్రామంలో 6.50 ఎకరాల భూమిని గుత్తకు తీసుకొని మిరప సాగు చేశాడు. అయితే సరైన దిగుబడి రాకపోవటంతో సుమారు రూ.6.75లక్షలు అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చలేనని మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల13వ తేదీన ఇంటి ముందు కల్లాపి చల్లుకొనే పేడపౌడర్(కెమికల్‌తో కూడినది)ను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుని భార్య మౌనిక ఫిర్యాదు మేరకు ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి కేసు నమోదు చేశారు. మృతునికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



ఎమ్మెల్యే కాటసాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గౌండ షేక్షావలి, ఖాజీవాడకు చెందిన 20 కుటుంబాలు

బనగానపల్లెరూరల్: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని సమక్షంలో శనివారం పట్టణంలోని ఖాజీవాడకు చెందిన గౌండ షేక్షావలి(కాంట్రాక్టర్)తోపాటు ఇరవై కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గౌండ షేక్షావలితో పాటు గౌండ చాంద్‌బాషా, గౌండ అహమ్మద్‌హుస్సేన్, గౌండ మహమ్మద్, గౌండ అమీర్, గౌండమహబూబ్ బాషా, గౌండ పాంషా, అస్లాం, గౌండ దస్తగిరి, గౌండ మౌలాలీ, గౌండ అరుణ్, గౌండ అబ్బాస్, జి. సుభాన్, గౌండ అజ్మిత్, గౌండ ఇనామతుల్లా, గౌండ రఫీ,గౌండ సద్దం, గౌండ నవాజ్, గారమద్దిలేటి, గౌండ అస్లాం తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఖాజీవాడలో గౌండ షేక్షావలి కుటుంబానికి మంచి పేరు ఉందని, వీరు వైఎస్సార్‌సీపీలో చేరడం వలన పార్టీకి మరింత బలం చేకూరుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరడం అభినందనీయమన్నారు. వచ్చే 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేందుకు అందరం సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని తిరుపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్‌ఫైజ్, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, వార్డు సభ్యులు సురేష్, నాయకులు కంబగిరి, మహబూబ్‌వలి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లెరూరల్: అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని బనగానపల్లె అగ్నిమాపక శాఖ అధికారి నరసింహులు సూచించారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అగ్నిమాపకశాఖ అధికారి నరసింహులు మాట్లాడుతూ ప్రజలు బీడి, సిగరెట్ వంటి వాటిని తాగి ఎక్కడ పడితే అక్కడ వేయరాదన్నారు. ప్రమాదాలు జరిగితే వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని, ప్రమాదల నివారణాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అదేవిధంగా అగ్నిప్రమాదాల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బంది శివశంకర్‌రెడ్డి, రాజశేఖర్,శ్రీనివాసులు,కాశీశ్వరుడు;హాజీబాషా తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్ని మాపక కేంద్రం అధికారి రంగస్వామిగౌడ్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరిస్తూ అందుకు సంబంధంచిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు, కర్మాగారాలు, గోదాములు, స్కూళ్లు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్ తదితర ప్రాంతాల్లో చోటు చేసుకునే అగ్ని ప్రమాదాల నుంచి సురక్షితంగా బయటపడే మార్గాలు, నివారణ చర్యలు గురించి అవగాహన కల్పించారు.

విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో అరటితోట దగ్ధం



కాలిపోయిన అరటి తోటను చూపిస్తున్న రైతు వెంకట నారాయణ

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో మంటలు చెలరేగి అరటి తోట దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. హెచ్ కొట్టాలకు చెందిన వెంకట నారాయణ, కృష్ణ మోహన్ ఐదు ఎకరాల్లో అరటి పంట సాగు చేశారు. ప్రస్తుతం అరటి తోట పక్వదశలో ఉంది. ఈక్రమంలో శనివారం తెల్లవారుజామున అరటి తోటలోని విద్యుత్ తీగ తెగి షార్టు సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. గమనించిన గ్రామస్తులు విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. అయినా మంటలు అదుపులోకి రాక అరటితోటతో పాటు డ్రిప్‌పైపులు, తెల్లపైపులు పూర్తిగా కాలిపోయి రూ. 10 లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు బాధిత రైతులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన రామకృష్ణ

బనగానపల్లెరూరల్: మండలంలోని తమ్మడపల్లె రోడ్డులో ఉన్న ధనలక్ష్మీ ఫంక్షన్‌హాల్ సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొట్టుకొన్న సంఘటనలో గొల్ల రామకృష్ణ (34) అనే వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలైన సంఘటన శనివారం రాత్రి జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు మండలంలోని చెర్లోకొత్తూరు గ్రామానికి చెందిన గొల్ల రామకృష్ణ బనగానపల్లెలోని రైస్ మిల్లులో కూలీ పని చేసుకుంటు కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కొద్ది రోజుల నుంచి భార్య అనురాధ పుట్టినిల్లు తమ్మడపల్లె గ్రామంలో ఉండడంతో రామకృష్ణ బనగానపల్లెలో పని చేసుకొని అత్తగారి గ్రామంలో ఉన్న భార్యవద్దకు వెళ్తుండేవాడు. ఈ క్రమంలో శనివారం బనగానపల్లెలో పని పూర్తి చేసుకొని తమ్మడపల్లెకు మోటార్ సైకిల్‌పై బయల్దేరాడు. అయితే ధనలక్ష్మీ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎదురుగా తమ్మడపల్లె గ్రామానికి చెందిన మాదవ్, గురుశంకర్ ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి రామకృష్ణ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టారు. దీంతో రామకృష్ణ అక్కడికడే మృతి చెందగా, మాధవ్, గురుశంకర్ తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రగాయాలైన వారిని చికిత్స కోసం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాల్సి ఉంది. మృతుడికి సుమారు ఒక సంవత్సరం కూతురు.

లోకేశ్‌కు రాజకీయ పరిజ్ఞానం శూన్యం

- డోన్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కనిపించడం లేదా?
- స్థానిక సమస్యలపై అవగాహన లేకనే పిచ్చి వాగుడు
- మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్యాపిలి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు ఏమాత్రం రాజకీయ పరిజ్ఞానం లేదన్న విషయం శుక్రవారం ప్యాపిలి బహిరంగ సభలో ఆయన మాట్లాడిన తీరుతో మరోసారి తేటతెల్లమైందని స్టేట్ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, డోన్ మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కేంద్రం నుంచి అప్పులు తెస్తున్నది రాష్ట్ర అభివృద్ధి కోసం అనే ఇంకితజ్ఞానం కూడా లేకుండా నారా లోకేశ్, టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి విమర్శించడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన దాదాపు నాలుగేళ్లలో డోన్ నియోజకవర్గంలో దాదాపు రూ. 3 వేల కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులు కనిపించడం లేదా? అని వారు ప్రశ్నించారు. డోన్ నియోజకవర్గంలో డి. రంగాపురం నుంచి ఎస్ రంగాపురం వరకు చేపట్టిన పాదయాత్ర ఆద్యంతం ఆర్థిక మంత్రి వేసిన రోడ్లమీదే సాగిందన్న విషయాన్ని నారా లోకేశ్ గుర్తుంచుకోవాలన్నారు. గుండాలలో వెలసిన పురాతన లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధిని కోట్ల, కేఈ కుటుంబాలు విస్మరించాయన్నారు. అయితే మంత్రి బుగ్గన ఆ ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు అక్కడ టీటీడీ కల్యాణ మంటపాన్ని నిర్మిస్తున్నారని, అయితే టీడీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. ఇసుక విషయంలో ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన విధానంతో వెళ్తుంటే టీడీపీ నాయకులే అక్రమంగా ఇసుక వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. గత టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, ఈ మూడున్నరేళ్లలో డోన్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని వారు సవాల్ విసిరారు. మైనింగ్ యజమాని లద్దగిరి శ్రీను హత్య వెనుక టీడీపీ నాయకులు ఉన్నారన్న విషయం అందరికీ తెలుసన్నారు. ఈ హత్య కేసును వైఎస్సార్ సీపీ నాయకులకు అపాదిస్తూ నారా లోకేశ్ అవాకులు చెవాకులు పేలారన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్లు బోరెడ్డి పుల్లారెడ్డి, మల్లెంపల్లి రామచంద్రుడు, న్యాయవాది నాగభూషణ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, తాలూకా సోషల్ మీడియా కన్వీనర్ దినేశ్ గౌడ్, నాయకులు జంగం చంద్రశేఖర్, వి. శ్రీనివాసరెడ్డి, వాసు రెడ్డి, బషీర్, సోమశేఖర్, కొండయ్య, గండికోట రామాంజనేయులు, షాషా, బోరెడ్డి రఘు, ఎస్కే వలి, బాలరంగయ్య పాల్గొన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు



పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

కోవెలకుంట్ల: పట్టణంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభమైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారం ముగిశాయి. చివరి రోజు నిర్వహించిన సోషియల్ పరీక్షకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 220 మందికి నలుగురు, బాలికోన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 140 మందికి ఇద్దరు, సెయింట్ జోసఫ్స్ పరీక్షా కేంద్రంలో 220 మందికి ఒకరు గైర్హాజర్ అయినట్లు ఎంఈఓ తిమ్మారెడ్డి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. ఆయా కేంద్రాలకు చీఫ్ సూపర్‌వైజర్లుగా రామకృష్ణ, అరుణకుమారి, లలిత శ్యామల, డిపార్ట్‌మెంటల్ అధికారులుగా రాజ్యలక్ష్మి, కుమార్‌బాబు, యాంగటప్ప వ్యవహరించినట్లు పేర్కొన్నారు.

కొలిమిగుండ్ల: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. మండలంలో కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 12 ప్రభుత్వ పాఠశాలలు, ఒక ప్రవేట్ పాఠశాల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎక్కడా లోపాలు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు ముందస్తు చర్యలు చేపట్టడంతో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

డోన్ టౌన్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారం ముగిశాయి. ఇందులో 17వ తేదీ సోమవారం సంస్కృతం, 18వ తేదీ ఓకేషనల్ కోర్సులకు సంబంధించిన పరీక్షలు ఉన్నట్లు డోన్ డివిజన్ ఉప విద్యాధికారి క్రిష్టపర్ తెలిపారు. సంస్కృతం పరీక్ష 9 కేంద్రాల్లో, ఓకేషనల్ కోర్సుకు సంబంధించిన పరీక్ష ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల్లో మాత్రమే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. చివరి రోజు ఆరు పరీక్షా కేంద్రాలను ఈయన తనిఖీ చేయగా వెంకటసుబ్బారెడ్డి, గ్రేసమ్మ మిగిన కేంద్రాలను పరిశీలించారు.

బేతంచెర్ల: ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభమైన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారం ముగిశాయి. మండే ఎండల మధ్య ప్రారంభమైన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సోషల్ పరీక్షతో ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షా కేంద్రాలలో నుంచి హమ్మయ్యా బరువు దిగింది అన్నట్లుగా విద్యార్థులు సంతోషంగా బయటకు వచ్చారు. తోటి మిత్రులతో పరీక్షలు రాసిన తీరుపై మాట్లాడుకుంటూ హుషారుగా ఇళ్లకు వెళ్లారు.